వార్త - ఆదివారం 2001

# మానిగమం

మానిగమం

'నిగమాంతం వచ్చాడు'

ముసురుపట్టిన ఆదివారం ఉదయాన్నే గురుమూర్తి మోసుకు తిరుగుతున్న వార్తది. అరిటాకులోడి పంచలో కూచుని సిగరెట్ కాలుస్తూ... నేనూ అరిటాకుల వెధవా ప్రపంచమ్మొత్తాన్నీ విమర్శిస్తూ మాట్లాడుకుంటూంటే...

"గార్బచేవ్ గ్లాస్‌నాస్త్... గ్వాలియర్రాజూ గంగలో కుళ్లూ... బురుండీ బూజు తెగులూ అప్పారావు బసవరాజా గురజాడా ఏవీయెస్సా..." అంటూ ఒక దాంతో ఒకటి సంబంధంలేని విషయాలు పేలుతూ వచ్చాడు.

అర్థమైపోయింది...

నిగమాంతాగమన పర్యవసానమదని తెలిపోయింది.

రెండ్రోజులు గురుమూర్తిని పట్టేవాడుండడిక... అసలు యీ ప్రపంచానికి తన ఉనికినే తెలీనివ్వని గురుమూర్తి, నిగమాంతం వచ్చాడంటే... అంతే... అలెగ్జాండరు వెనకున్న సెలూకసైపోతాడు. యెవరేనా యేమేనా అంటే చాలు.

"ఖబర్దార్... ని...గ..మాం....తం" అంటాడు.

"నిగమమెప్పుడొచ్చాడ్రా గుర్మూర్తీ?" అడిగాడు అరిటాకులవాడు.

"రాత్తిర పన్నెండింటికి" అన్నాడు గురుమూర్తి.

"నిజమే దెయ్యాల వేళగదూ...

హి...హ్హి... హీ" అని ఓ పిచ్చినవ్వు నవ్వి నావేపు అర్థవంతంగా చూసాడు. అరిటాకుల వెంకట వరాహకృష్ణన్నృసింహావధానిగాడు.

వాడికి నిగమం అంటే మంట. నిగమంలో వున్న విద్యని విస్మరించి, వాడి వికృత చేష్టల్ని మాత్రం భూతద్దంలోంచీ చూట్టమే కాదు... అందరికీ చూపిస్తాడు కూడా...

నిజానికి నాక్కూడా నిగమంగాడి చేష్టలు యింతవరకూ అర్థమవలేదు... చిన్నప్పట్నించీ అంతే....

మానిగమంగాడి పూర్తిపేరు తాడనబత్తుల నిగమాంతశర్మ... ఆరో క్లాసులో కొత్తగా చేరినవాడిని... ఫిజిక్స్ టీచర్ విమ్లాజేమ్స్... "పేరేంటి బాబూ? కొత్తగా చేరావా?" అనడిగితే... ఎర్రగా దిద్దుకున్న నామం... తెల్లగా చలువ చేసిన్చొక్కా... నున్నగా వెనక్కి దువ్వుకున్న జుత్తుతో లేచి నిలబడి చేతులు రెండూ కట్టుకుని దర్పంగా గోత్ర సహితంగా తన ప్రవర చెప్పిన నిగమం....

ఇప్పటికీ భీతిల్లిన విమ్లాజేమ్స్ అనబడే విమలమ్మగారి మొహం గుర్తుంది నాకు... "వెధవా! వేలెడులేవు పేరడిగితే యేమిటేమిటో పేలుతావురా" అని అరిచిందామె...

"లేదండీ యెవరేనా పేరడిగితే ప్రవర మొత్తం చెప్పమన్నారండీ మా నాన్నగారు..." అన్న నిగమంగాడు... యెస్సెల్సీ స్కూలు ఫస్టున పేసైన నిగమాంతం... బియ్యేలో ఫ్రెంచి సెకెండ్లాంగ్వేజీగా తీసుకుని... ఫ్రెంచి సాహిత్యంపై ర్యాంబో ప్రభావం అనింగ్లీష్లో యెంఫిల్చేసి... హైదరాబాదులో తూనికలు - కొలతలూ శాఖలో ప్రస్తుతం సెక్షన్హెడ్డుగా వున్న 'నిగమం' అని మేం పిల్చుకునే నిగమాంతం వచ్చాడు. వాళ్ల నాన్న వాడికా భయంకర నామకరణచేస్తే, వీడింకా భయంకరంగా తన పిల్లలిద్దరికీ పేర్లు పెట్టాడు...

పెద్దాడు కొడుకు వాడికి పురుహూతుడనీ, చిన్నది కూతురు దానికి గార్గి అనీ పేర్లు పెట్టాడు.

"యేవిట్రా నిగమం ఈ పేర్లు ఈ రోజుల్లో?" అని మేమడిగితే "అంతేమరి మా నాన్నని తాళ్లతోటి కట్టేసి కొట్టి హింసించలేనుగదా" అని వంకర నవ్వు నవ్విన్నిగమమెచ్చాడు. వాడి పిల్లల నామధేయాలకీ వాళ్ల నాన్నకీ సంబంధమేమిటో పెద్దగా ఆలోచించాల్సినవసరం కలగలేదు మాకెవ్వరికీ. పురాణాలూ, నిఘంటువులూ అన్నీ వెదకెదకి వాళ్ల నాన్న వాడికి నిగమాంతశర్మ అన్న పేరు పెట్టాడన్న వాడి కసి తన పిల్లలకా పేర్లు పెట్టి తీర్చుకున్న నిగమం....

వాడి చేష్టలన్నీ యాంత్రిక దృష్టితో చూసేవాళ్లకి చాలా వికృతంగా దుర్మార్గంగానూ వుంటాయి.

వాడి తల్లి కోమాలోకెళ్లి ఓ యేడాదిపాటు మంచంలో తీసుకుని తీసుకుని మరణించింది. మరణించిన్రోజున..."మా అమ్మ యెప్పుడో చనిపోయింది... ఈ రోజుకేడాదైంది" అన్న నిగమాన్ని అందరూ అసహ్యంగా చూసారు. వాళ్ల అమ్మగారి పితృకర్మలకి గోకర్ణం వెళ్లిన విషయం మాకిప్పటికీ బాగా గుర్తుంది.

హుబ్బళి రైలెక్కుతూ... "వరేయ్ గోకర్ణానికి గోవా చాల్దగ్గిర మా ముసిలాణ్ణి

త్వరగా తరిమేసి నేనూ భద్రం (వాడి భార్య సుభద్ర) గోవా వెళ్తాం... అక్కడ బీచీలో చెడ్డీతో బియర్ తాగాలని యెప్పట్నించో నా కోరిక" అన్న నిగమాన్ని చూస్తూ...

"తల్లి చచ్చి దినాలు కూడా కాలేదు వీడేమ్మనిషిరా!" అని అరిటాకులోడు నా చెవులో ఘోషించడం యింకా గుర్తుంది...

అన్నట్టుగానే చేసాడు నిగమాంతం...

గోకర్ణంనించీ వచ్చిన నిగమం తండ్రి కన్యాశుల్కంలో అగ్నిహోత్రావధానుల్లెవల్లో హుంకరింపులూ, పెడబొబ్బలూ పెడ్తూ మాకు చెప్పాడు గోకర్ణంలో జరిగిన సంగతులు.

అక్కడి బ్రాహ్మడు యెడాపెడా అన్ని భాషలూ మాట్లాడ్తోంటే కావాలని అతన్తో ఫ్రెంచిలో మాట్లాడాడుట... అతను వినేలా తండ్రితో... "నాన్నా! మనం యిటు తిరిగితే పిండాలు పిసుక్కుని తినేసేవాళ్ల లేదూ వీడు? పింజారీ వెధవ! వీడేం బ్రాహ్మడూ మనూళ్లో మంగళతీర్థం శాస్తుర్లే మేలు... కాస్త మాటుగా మందేసుకుంటాడూ బీడీలు కాలుస్తాడూ అంతే మహా అయితే అన్నాట్ట... అన్ని భాషలూ తెల్సిన కాశీపాండా గూండాలాంటి ఆ బ్రాహ్మడు... "నన్ను పిండాలు పిసుక్కుతినే వాడంటావురా" అని గోకర్ణ సముద్రంలా విరుచుకుపడి నానా బీభత్సం సృష్టించాట్ట...

"నాక్తెల్సారే... కావాలనే మా నిగమం ముండాకొడుకు వాడితో గొడవ పెట్టుకున్నాడు.... నన్ను వీలైనంత వేగిరం తరిమేసి ఆ పెళ్లాం పిల్లతో గోవాలో కులుకుతూ జల్సా చేయడానికి యీ యెత్తులన్నీ దొంగవెధవ నాకు తెలీదనుకుంటాడు" అని చాత్రోజులు పిసుక్కు చచ్చాడు ముసిలాయన.

ఇలాంటి వికృత చేష్టల మాటున నిగమాంతం... రీతినీ, రివాజునీ గొర్రెల్లా మనం నమ్మే నమ్మకాల్నీ నిలదీస్తూ వేసిన ప్రశ్నలు మనం వినిపించుకోం... భయస్తులం... 'ఎందుకు' అన్న ప్రశ్న వేసుకోలేని వాళ్లం. ప్రతి విషయాన్నీ ఎగతాళి చేసే నిగమం...

ప్రకృతిలోని ప్రతి చిన్న విషయానికీ ఓ వికృతిని చూపే నిగమం... వికట కవి లాంటి నిగమం...

భూతద్దాల నిగమం...

నియమమూ అన్న ప్రతిదాన్నీ అతిక్రమించడమే నియమంగా పెట్టుకున్న నిగమం...

'నువ్వో నిఖార్సైన నిహిలిస్టువిరా నిగమం' అంటే దానిక్కూడా 'నహినహి' అనే నిగమం...

తాడన బత్తుల నిగమాంతశర్మ... గురుమూర్తిగాడి ఇష్టదైవం... వచ్చాడు... అదీ ఆదివారం పుదయాన్నే మేం విన్న వార్త... అది కూడా గురుమూర్తి ముఖతః

నిగమాంతాగమనం... విషాదమెరుగని నిగమాంతం... సరిగ్గా ముప్పయ్యారేళ్ళైంది వాడు మాకు పరిచయమై. యేనాడూ విషాదమన్న రసం వాడి ముఖాన చూసెరగం.

ఓ చిర్నవ్వు ఘనీభవించి వాడి ముఖానికతుక్కునుంటుంది.

ఆ నిగమం వచ్చాడు... ప్రతేడూ వస్తాడు. చాలా ఏళ్లుగా వస్తూనే వున్నాడు. వస్తుంటాడు కూడానేమో.

సరిగ్గా సంవత్సరంలో యిదే తారీఖున వస్తాడు. తుఫాను వచ్చినా... భూకంపాలొచ్చినా... యేమొచ్చినా సరే... నిగమాంతం రాకుండా మాత్రముండడు.

సరిగ్గా యిదే తారీఖున వస్తాడు. అదో మిస్టరీ మాకు. సరిగ్గా యిదే తారీఖు... రెండంటే రెండే రోజులుంటాడు...

వెళ్లిపోతాడు.

వచ్చిన ప్రతిసారీ గురుమూర్తి ఇంట్లోనే దిగుతాడు.

ఇక్కడ గురుమూర్తి గురించి చెప్పాలి. నేనూ, అరిటాకులవధానీ, గుర్మూర్తీ చిన్నప్పట్నుంచీ జట్టు... ఆ జట్టులో ముప్పయ్యారేళ్ల క్రితం కలిసాడు నిగమం... వాడొచ్చిన మొట్టమొదటిరోజే గురుమూర్తి వాడి అభిమాని, అవధాని వాడి శత్రువు అయ్యారు. నిగమం పీ.యూ.సీ వరకూ మాతో చదివాడు. తర్వాత చదువురీత్యా, ఉద్యోగరీత్యా దూరమైనా ఎన్నెన్ని ఊళ్లు తిరిగినా... సంవత్సరంలో ఓమాటు మాత్రం ఖచ్చితంగా కలిసెళ్తూనే వున్నాడు. వాడు కలిసున్నంత వరకూ గురుమూర్తి లోకమే వేరుగా వుండేది. నవ్వుతూ గలగలా మాట్లాడే నిగమాంతమే వాడిలోకం... గుర్మూర్తి కూడా నవ్వుతూ తిరిగేవాడు. పీయూసీ పేసవగానే గుర్మూర్తికి వాడి మేనకోడలు ముఖలింగేశ్వరితో పెళ్లైపోయింది. చేయడానికి ఉద్యోగం లేదు. తీరికూచుని పెళ్లి చేసిన పెద్దలు అంతగా పట్టించుకోలేదు. వాడికా జ్ఞాన శూన్యమైన వయసు తప్ప యింకేమీ లేదు. వేరే పనేమీ లేదు... పర్యవసానం...

ముఖలింగేశ్వరికి అయిదు గర్భాలు...

అందులో మూడు స్రావాలూ... రెండు జీవాలూ...

ఆ తర్వాత గురుమూర్తికి సింగిల్ స్కూల్ టీచరు ఉద్యోగం... వాడి భార్యకు సంక్రమించిన అనారోగ్యం... అప్పులు చేయడంలో ఆనందం మిగిలాయి.

పెద్దలు పోతూ ఓ పాత కొంపని మాత్రం వాడికొదిలేసి వెళ్లారు.

ఆ పాత కొంపని వెనకవీధిలోకి రెండు భాగాలూ ముందు వీధికో భాగం చేసి ముందు భాగంలో గురుమూర్తి కాపురముంటూ, వెనకవీధి భాగాలు రెండూ ఓటి కలక్టరేట్ గుమాస్తా ఏసురత్నానికీ, యింకోటి కూరగాయల మండీ మాబూ బాషాకీ అద్దెకిచ్చాడు. భారద్దేశపు ట్రూ రేప్రజెంటేషను వాడి కొంప...

అందుకే అప్పుచేయడం వాడి సహజగుణంలా అయిపోయింది... వాడి అవసరాలూ అలాగే వుంటాయి. అప్పులు చేస్తాడు తంచనుగా తీరుస్తాడు. మళ్లీ అప్పులు చేస్తాడు.. అలా అదో గొలుసు.

గుర్మూర్తి అయిదో తారీఖున తీర్చేస్తానని అప్పుతీసుకున్నాడంటే అది రిజర్వ్ బ్యాంకు గవర్నరు హామీయే... తంచనుగా అయిదో తారీఖున ఉదయాన్నే మీ గుమ్మమ్ముందునుంచుని...

'మాస్టారూ మీ మహాలక్ష్మి' అన్చెప్పి యిచ్చేస్తాడు. మహా 'నిఖార్సైన మనిషండీ గుర్మూర్తి మేస్టారు' అన్న పేరుతో మొత్తం ఊరు ఊరినే ఓ బ్యాంకు చేసి పారేసుకున్నాడు. వాడి బ్యాంకుకు ఆదివారాలూ, హర్తాళ్లూ... దేశాధినేతల చావులూ... వర్కింగవర్సూ గట్రా వుండవు.... అర్థరాత్రి కూడా శుభ్రంగా 'డ్రా'చైగల్డు గుర్మూర్తి. పాస్‌బుక్కులూ, చెక్కుబుక్కులూ లేని అసలు సిసలు ఖాతా అది... మీకు చెప్పాను... నిగమం వచ్చాడంటే వాడి విడిది గుర్మూర్తి కొంపే. గురుమూర్తికి నిగమాంతాగమనం ఓ పండగ... వట్టి పండగేమిటి బ్రహ్మోత్సవమే...

నిగమమూ ఊళ్లో లాడ్జీలున్నాయి దిగడు.

నేనూ... అరిటాకులవధానీ దిలాసాగా వున్నవాళ్లమే... మా కొంపలు పావనం చెయ్యడు... కనీసం ఆ రెండురోజుల్లో కాఫీకి కూడా రాడు... పైగా ఆ రెండు రోజుల్లో కనీసం ఓ పూటైనా అవధానికీ, నాకూ గుర్మూర్తింట్లో విందు భోజనమే...

గురుమూర్తి అప్పుచేయని వ్యక్తంటూ మా పరిచయస్తుల్లో లేరు.... ఒక్క అరిటాకులవాడూ, నేనూ, నిగమం తప్ప... ఇన్నేళ్లల్లో మా దగ్గర ఎర్ర ఏగానీ పుచ్చుకునెరగడు గురుమూర్తి...

ఎప్పుడేనా మరీ ఇబ్బందుల్లో వున్నాడనిపించి అవధానో నేనో... 'వరేయ్ గుర్మూర్తీ యీ అయిదొందలుంచరా' అన్నా కూడా... 'ఇప్పుడే... ఇంతకుముందే సుబ్బడి దగ్గర పుచ్చుకున్నారా' అనో మరోటో చెబుతాడు.... నిగమం వెధవకీ తెలుసు... వాడొచ్చాడంటే గుర్మూర్తి మామూలుకంటే మూడింతలు అప్పు చేస్తాడని... అయినా వాడి కొంపలోనే దిగుతాడు... ఎప్పటికప్పుడు... యేఏటికాయేడు నిగమాన్ని అడిగి కడిగి పారేయాలనుకోవడమే నేనూ అవధానీ... కానీ వాడిని చూడంగానే గొంతు పెగిలి ఛావదు.

* * *

"మజ్జాన్నం బోయనాల్తర్వాత్రతండింటికి... త్యాగరాజు కీర్తనల్లో సాహిచ్చెం దానౌచిత్యం గురించి మాటాడ్దాట్ట నిగమం... మరవకండొరేయ్..." వక్క నములూ ఆహ్వానం విసిరేసి వెళ్లిపోయాడు గుర్మూర్తి. వాడి పాత హంబర్ సైకిలెక్కి.

ఈ రెండ్రోజులే వాడు నైమిత్తికాల్తప్పతద్భిన్నమైనవి మాట్లాడేది... నిగమం వెళ్లిపోగానే వీడో యుగాంతమైపోతాడు. గుర్మూర్తటు వెళ్లగానే...

"ఈ నిగమంగాడు గుర్మూర్తికి ఆజన్మ శనిరా... అయినా పెద్ద చదువుల్చది వేడిచాడుగా... తెలీదూ వెధవకి? వీడిమీద పడి ఛస్తాడు... లాడ్జీలున్నాయి అక్కడ్బా వొచ్చుగా... ఈ ముండవెధకేనా తెలివేడవక్కర్లేదూ... వాడొస్తేచాలు బ్రహ్మోత్సవాల్చేసి పారేస్తాడు... ఈసారి... ఈసారి మాత్రం వదల్నంతే నిగమం గాడిని కడిగేస్తానంతే..." బుసలుకొడ్తూ అవధానన్నాడు....

నాకూ అడిగేయాలనే వుంది... చాలా ఏళ్లగా లోపల తొలుస్తూనే వుంది... నిగమాంతం గుర్మూర్తినే కటాక్షించడం వెనక మతలబేమిటి? బుర్రబద్దలు కొట్టుకున్నా సమాధానం దొరకదు. మంచినీళ్లలా డబ్బుని ఖర్చుచేసే నిగమాంతం సంవత్సరంలో ఈ గుర్మూర్తిగాడికి తిరుక్షవర దైవం కావడమేమిటి... వాడేనాడే పనిని సక్రమంగా చేసేడ్చాడు గనక అర్థమై చావడానికి... నాకూ అడగాలనే వుంది... వాడి వెనక యిలా గింజుకు చావడమే తప్ప వాడి ముందు నోరు పెగల్దు. వాడు మాట్లాడ్తోంటే... పచ్చటి మేనిఛాయతో... బొజ్జన్నిమురుకుంటూ చాపమీద గోడకానుకుని అరవాళ్వార్లా వాడు కూచునుంటే నోర్తెర్చుకుని వింటం మినహా యింకేం చేయలేమన్న సంగతి నాకూ అరిటాకులోడికీ యిద్దరికీ క్షుణ్ణంగా తెల్సు...

అడుగంటా కాలిన సిగరెట్ని వాకిట్లో మురుక్కాలవలోకి గిరాటేసి అన్నాడు అవధాని...

"త్యాగరాజు కీర్తనల్లో సాహిత్య ఔచిత్యం గురించి మాట్లాడ్తాట్ట వెధవ సర్వజ్ఞాని... నాకు చెయిన్లింటో ఈ రోజు నిమంత్రణ... పిండాకూడవ్వంగానే తిన్నగా గుర్మూర్తి గాడింటికొచ్చేస్తా నువ్వటొచ్చెయి – ఈరోజు వాడి కథేమిటో తేల్చి పారేయ్యాల్సిందే" కసిగా...

నిజమే... త్యాగరాజకీర్తనల్లో సాహిత్యం...! అదేనేమిటి యే విషయమైనా సరే పరిపూర్ణమైన అవగాహన్తో మాట్లాడ్తాడు వాడు. త్యాగరాజేమిటి... తైమూరు గురించీ... థాయ్ వంటల్గురించీ... బర్మూడా ట్రయాంగిల్మీదా... బైర్లాటి చెంచుల మీదా... బయో డిగ్రేడబుల్ ప్లాస్టిక్స్ మీదా... బయలాజికల్ బామ్స్పైనా.... ఇటాలియన్ 'రిసొటో'కీ మన చిత్రాన్నానికీ అనూహ్య సంబంధం అంటగడ్తూ... యాంటీగ్రావిటీలో సైన్సుకీ... మన యోగంలో లెవిటేషన్కీ సంబంధం కల్పుతూ... మార్సుమీదో కాలూ మునిగిపోయినట్లాంటి స్మీదింకో కాలూ వేసి పేట్రేగిపోయిన వామనమూర్తిలా పెరిగిపోతూనే వుంటాడు నిగమాంతం.

వాడు మాట్లాడ్డం మొదలు పెట్టాడంటే అంతే యిక...

* * *

షరా మామూలుగా రెండ్రోజులు గడిచిపోయాయి. నిగమాన్ని నిలదీయాలనుకున్న అవధానీ నేనూ నోళ్లు మెదల్పలేక పోయాం.

సాయంకాలం ట్రెయినుకి నిగమం వెళ్తాడు... గుర్మూర్తి కూతుర్ని చూసుకోడానికొస్తున్నామని చాల్రోజుల్గా గుర్మూర్తి ఎదురుచూస్తున్న పెళ్లి సంబంధం... సాయంకాలం ఈ సాయంకాలమే వస్తున్నామని కబురు చేయడంతో... నిగమాన్ని సాగనంపే కార్యం నామీదా అరిటాకులవాడి మీదా పెట్టాడు గుర్మూర్తి...

అసలు నిగమాన్ని పెళ్లిచూపులైంతర్వాత వెళ్లమని అడిగాడు గుర్మూర్తి...

నేవుంటే కుదిరే సంబంధం తెగిపోతుంది... పెళ్లికెలాగూ వస్తాగా" అని బయల్దేరాడు నిగమం...

స్టేషన్లో కూడా మాట్లాడుతూనే వున్నాడు...

ఉన్నట్టుండి అవధాని గొంతు పెగుల్చుకుని అన్నాడు...

"గుర్మూర్తి విపరీతంగా అప్పులు చేస్తున్నాడ్రా నిగమం"

తెలుసన్నట్టు తలాడించి... "నిజమే... మన ముగ్గురి దగ్గరా చిల్లిగవ్వ తీసుకోడు... ఏంచేస్తాం... వాడి తిప్పలు వాడు పడ్తున్నాడు..." అన్నాడు నిగమం... మొహమ్మీద గడ్డకట్టిన చిర్నవ్వుతో...

"నువ్వొచ్చినప్పుడింకా... ఎక్కువ... నువ్విలా... నీకిది తగదురా నిగమం" అనేసాడు అరిటాకులవాడు ధైర్యం కూడగట్టుకుని పొడిపొడి మాటలే నా గుండె కొట్టుకోడం నాకే వినిపిస్తోంది... స్టేషన్మొత్తం నిశ్శబ్దమైపోయినట్టనిపిస్తోంది...

ఎదురుగా సఫారీ సూట్లో నిలువెత్తు నిగమం పచ్చటి మేనిఛాయతో భూతద్దాల్తో... వాడి ముఖంలో భాగమైన చిర్నవ్వు తెగి రాలిపడుతుందనుకున్నా... ఊఁహూఁ... అందరూ అనుకునేలా వుంటే వాడు నిగమమెలా అవుతాడు...

ఆ చిర్నవ్వు పేద్ద నవ్వుగా మారింది...

"ఆహ్హోహ్హోహో.... ఒహ్హోహ్హోహో... నాక్తెల్సొరేయ్... నేనో మీరో చచ్చేంత లోపల మీరీ ప్రశ్న వేస్తారని... అయినా వెధవల్లారా ఇన్నేళ్లు పట్టింద్రా మీకీ చిన్న ప్రశ్న వేయటానికి? అసలు గుర్మూర్తిగాడి జీవితమేమిటో చెప్పండ్రా... వూఁ? చెప్పండి చూద్దాం....

చిటికెడు విషాదం.. చెమ్చాడు బాధ... ఉద్ధరిణెడు హింస... ఇంకొంచెం కన్నీళ్ళు... అన్నీ కలిపి మొనాటనీ అనే వంటకం... రోజూ అదే ముద్ద... అప్పుల్చేస్తాడు

సరే, తెలుసు, మన ముగ్గురికే కాదు ఈ ప్రపంచంలో వాడు తెల్సిన వాళ్లందరికీ తెల్సు... వాడప్పుల్చేస్తాడు...

అప్పుచేసి పండగ చేస్తాడు. ఆనందంగానా? ఊఁహూఁ... నో... అప్పుచేసి తద్దినాలు పెడ్తాడు... ఏడుస్తూనా? ఊఁహూఁ... కానేకాదు... వాడి జీవితంలో ఆనందం అన్నది ఎక్కడ ఆగిపోయిందో నాకు తెల్సొరేయ్... నిగమమొచ్చినప్పుడు ఈ నిగంగాడొచ్చినప్పుడు వాడెక్కడో వదిలేసిన ఆనందాల గుర్తుల్ని తీసుకొస్తాడు... మీకు తెలుసా నేనున్న నలభై ఎనిమిది గంటల్లో దాదాపు తొంభై శాతం వాడు మన హైస్కూల్రోజులూ... మన పీయూసీ రోజుల గురించే మాట్లాడ్తాడు. సరిగ్గా అప్పుడే వాడు ఎదగకుండానే వాళ్ల పెద్దలు వాణ్ణి బలవంతంగా పెద్దవాణ్ణి చేసారు. మొగ్గరేకుల్ని మనం వేళ్లతో విడదీస్తే అది పువ్వవుతుందిరా? నేను మాట్లాడే మాటల్లో వాడు తన స్వేచ్ఛాజీవితంలోని ఆనందాన్ని పునః పునః చూసుకుంటాడు.... మీరిద్దరూ వాడితోటే వున్నా వాణ్ణి మించిన గానుగెద్దుల్మీరు... మీకీ సన్నటి రేఖ తెలీదు... నాకు తెలుసు... ఈ కొద్దిపాటి ఆనందం గుర్మూర్తి గాడికి ఖరీదైనదే... నా సొంతి బుర్రకి తట్టింది నేచేస్తున్నా... వాడు నేనొచ్చినప్పుడు చేసే అప్పు ఆనందంతో, సంతోషంతో స్నేహంతో చేస్తాడు చెయ్యనివ్వండి. మీకొచ్చిచచ్చిన్నష్టమేమిటీ అంతలా పిసుక్కు చావడమెందుకూ... ఒరేయ్ మీకింకో సంగత్తెలుసా వెధవాయిల్లారా? నేనెప్పుడూ ఇవే తారీఖుల్లో ఎందుకు తగలడి ఛస్తానో మీకు తెలుసా?" ఆయాసంగా ఆగాడు నిగమం...

తెలీదన్నట్టుగా గంగిరెద్దుల్లా తల అడ్డంగా ఊపాం నేనూ అరిటాకుల వాడూ...

"నిన్నను మూర్తిగాడి పుట్టిన్రోజు... గానుగెద్దులు మీరు మీ పుట్టిన్రోజులే మీకు గుర్తుండవ్... యింకా వాడి పుట్టిన్రోజు గుర్తుంచుకుని వాణ్ణి ఆనందపెట్టడం మీవల్లకాదు" అర్థవంతంగా చూస్తూ చెప్పాడు నిగమం.

మాకు నిగమాంతాగమనం సరిగ్గా ఈ తారీఖుల్లోనే యెందుకొస్తాడన్న రహస్యం విడిపోయింది.

రైలు రావడం, నిగమమెక్కడం జరిగిపోయింది.

చెయ్యూపుతూ మాకు క్రమంగా కనుమరుగౌతున్న మా నిగమం మాకు తెల్సిన తాడన బత్తుల నిగమాంతశర్మ కాదనిపించింది.

✻